తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## తల్లీ భవానీ కరుణించు గంగమ్మా...!



చౌడేపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
తల్లీ భవానీ కరుణించు గంగమ్మా... అంటూ భక్తులు మోకరిల్లారు. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లిలో కేతనపల్లి, చిన్నామనపల్లిలకు చెందిన గ్రామస్తులు పశువుల పండుగ, గంగజా తర్లను ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గ్రామ దేవతలకు విశేషాభిషేకాలు, అలంకరణలు గావించారు. మూడు గ్రామాలకు చెందిన మహిళలందరూ తెల్లవారు జామునుంచి పిండిదీపాలతో దేవతామూర్తులను ఆరాధించారు. వారందరూ బండమీదపల్లి గంగమ్మ ఆలయానికి రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనింది. రెండు రోజులపాటు గ్రామస్తులతోపాటు చుట్టుపక్కలవారు సాంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ముందు
## కపిలేశ్వర ఆలయంలో శుద్ధి



తిరుపతి, ఫిబ్రవరి 4ప్రభాతవార్త:
కపిలేశ్వరస్వామివారి ఆలయంలో ఈనెల 8 నుండి జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలోపల గర్భాలయం, ధ్వజ స్తంభం, ఉప ఆలయాలు, ఆలయ పరిసరాలను శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకాధికారి డి. ఫణికుమార్ నాయుడు, సూపరింటెండెంట్ చంద్ర శేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భోళాశంకరుని తిరునాళ్ళకు ముస్తాబు



బంగారు వాహనాలకు మెరుగులు దిద్దుతున్న దృశ్యం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు భోళాశంకరుడు ముక్కంటీశుని తిరునాళ్ళకు యుద్ధ ప్రాతిపదికపై ముస్తాబులు దిద్దుతున్నారు. ఓ వైపు రాష్ట్రంలోని అతిదులకు ఆహ్వానాలు అందిస్తూ మరో వైపు ఏర్పాట్లలో ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి తలమునకలై ఉన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఈ ఏడాది శివరాత్రిని నభూతో అన్నట్లు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నామని ఇఓ బాపిరెడ్డి వివరించారు. ఈ ఏడాది సాంస్కృతిక కార్యక్రమాల్లో సినీకళాకారులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. భక్తులను ఆకట్టుకునే కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. తనకు ఉన్న బడ్జెట్ పరిమితుల్లో దాతలను భాగస్వాముల్ని చేస్తూ కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో డ్రమ్స్ శివమణి, కోటి, గాయని గీతామాధురి, ఆధ్యాత్మిక చింతనకు గరికపాటి నరసింహారావులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.

**కొండ చుట్టకు శ్రీయ . . .**

ఈ ఏడాది మహాశివరాత్రి కొండచుట్టు కార్యక్రమాలకు సినీ నటి శ్రీయ వస్తామని భరోసా ఇచ్చినట్లు వివరించారు. గిరి ప్రదక్షిణకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 1గంటల వరకు ఎలాంటి వాహనాలను ద్విచక్రవాహనాలను కూడా అనుమతించమన్నారు. దాని వల్ల ఆకతాయిల ఆగడాలు ఎక్కువౌతున్నాయని ఇఓ అభిప్రాయపడ్డారు. కాగా గ్రామోత్సవాల్లో గగుర్పాటు కల్పించే కేరళ వాయిద్య బృందం 60 మంది, అంతేకాక రాష్ట్ర నలుమూలల నుంచి సంప్రదాయ కళా బృందాలను ఆహ్వానించినట్లు వివరించారు. కాగా సాంస్కతిక వేదికపై 'సురభి కళాబృందాల' దర్శనం ఉంటుందన్నారు. కాగా ఈ ఏడాది పూల అలంకరణలు, లైటింగ్‌లు ప్రత్యేకాకర్షణ కాగలదన్నారు. వచ్చిన భక్తులకు సుదర్శనంతో పాటు సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. తనకు బడ్జెట్ పరిమితి ఉందని కాబట్టి పలు అంశాలకు సంబంధించి దాతలను సంప్రదిస్తూ వారిని ఒప్పిస్తున్నట్లు వివరించారు. శివరాత్రి పర్వదినాన పిల్లలు, వృద్ధులు, పిల్లల తల్లులకు క్యూలైన్లలో బిస్కెట్లును చాగంటం ట్రస్టు అందించుటకు భోర్డు ప్రత్యేకాహ్వానితులు చాగణం శైలజ సంప్రదించినట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదిక ప్రారంభానికి ప్రముఖ సినీ దర్శకులు రావిపూడి అనిల్ ముఖ్యఅతిథిగా హాజరౌతారని ఇఓ వివరించారు.

**ఉత్సవ వాహనాలకు మెరుగులు:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఒక్క శివరాత్రి పర్వదినాన తప్ప మిగిలిన రోజులు ఉత్సవాలకే ప్రాధాన్యత కాబట్టి బంగారు వాహనాలకు ముస్తాబు చేస్తున్నట్లు ఇఓ బాపిరెడ్డి వివరించారు. ఓ వైపు ఏర్పాట్లు, మరో వైపు అతిధుల ఆహ్వానాలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నామని ఇఓ వివరించారు.

### కిడ్నాప్ కేసులో
## ఎంబియు పిఆర్ఓ సతీశ్ అరెస్ట్

**మరో 12మంది పోలీసుల అదుపులో**
**-మూడు కార్లు సీజ్**



తిరుపతి, పిబ్రవరి 4ప్రభాతవార్త:
ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో అక్రమాలపై నిరసన కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలను కిడ్నాప్ చేసిన కేసులో యూనివర్సిటీ పిఆర్ఓ రావూరు సతీశ్‌తోబాటు 13మందిని తిరుపతి పోలీసులు అరెస్టుచేశారు. మూడు ఇన్నోవా కార్లు, ఓ ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. మరికొంతమంది అరెస్ట్ కావాల్సి ఉందని తిరుపతి జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరచారి తెలిపారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్ సమీపంలో జరిగిన ఘటనపై తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం మధ్యాహ్నం 13మందిని అరెస్ట్ చేశామని, సాయంత్రం తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ రవిమనోహరచారి తెలిపారు. ఈ కేసులో తిరుపతి రూరల్ డిఎస్పీ బేతపూడి ప్రసాద్ పర్యవేక్షణలో తిరుచానూరు సిఐ బి.సునీల్‌కుమార్ సిబ్బంది ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా వ్యక్తిగత రక్షణకు నియమించుకున్న బౌన్సర్లు ఆవ్యక్తుల రక్షణకేఉండాలని, అనవసరచట్టవిరుద్ధంగా చర్యలకుపాల్పడకూడదని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



మృతుల ఫైల్‌ఫోటోలు


సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
సూళ్లూరుపేట పట్టణానికి సమీపంలోని జాతీయ రహదారిపై హోలీక్రాస్ జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. శ్రీసిటీలోని సిఇటిసి కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న యల్లా రాజశేఖర్ (33), ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేస్తున్న గోపిశెట్టి శ్రావణి (34)లు కంపెనీలో డ్యూటీ అయిన తర్వాత ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేటకు బయలుదేరారు. ఈ నేపథ్యంలో హోలీక్రాస్ జంక్షన్ వద్ద పట్టణంలోకి వచ్చేందుకు మలుపు తిరుగుతుండగా నెల్లూరు వైపు వెళుతున్న కంటైనర్ అతివేగంగా దూసుకొచ్చి వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. యల్లా రాజశేఖర్ తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా ఆరణి ప్రాంతానికి చెందినవాడు. గోపిశెట్టి శ్రావణి సూళ్లూరుపేటలోని గమండ్లవీధిలో నివసిస్తుంది. శ్రావణికి వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజశేఖర్‌కు ఇంకా వివాహం కాలేదని తెలిసింది. ఇద్దరు కంపెనీ ఉద్యోగులు దుర్మరణం పాలు కావడంతో సహోద్యోగులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ బ్రహ్మానాయుడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నాయుడుపేటలో 23 కేజీల గంజాయి పట్టివేత



నాయుడుపేట, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త
ఒరిస్సా నుంచి అక్రమంగా గంజాయి తరలించి నాయుడుపేట మండల ప్రాంతం అయిన మేనకూరులో సెజ్ కార్మికులకు చిన్నచిన్న ప్యాకెట్లు రూపంలో విక్రయిస్తున్న ముఠాని నాయుడుపేట పోలీసులు ఎట్టకేలకు చేదించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నాయుడుపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి చెంచు బాబు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఒరిస్సా నుండి గంజాయి అక్రమ రవాణా చేస్తున్న పింకీ అనే మహిళతో పాటు బీహార్, ఒడిస్సాకు చెందిన మరో నలుగురుని అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరు ఒరిస్సా, బీహార్ నుంచి అక్రమంగా తరలించి తీసుకువచ్చిన 23 కేజీల గంజాయి ని పట్టుకున్నట్లుగా తెలిపారు. ఈ దాడిలో పట్టుబడిన ఐదుమందిని కోర్టుకు హాజరు పరచడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో డిఎస్పి చెంచుబాబుతో పాటు సీఐ సంగమేశ్వర రావు, ఎస్సై భాను ప్రసన్న, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## అక్కపై తమ్ముడు వేటకొడవలితో దాడి



చౌడేపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
అన్నం తింటున్న అక్కపై చిన్నాన్న కుమారుడు వేటకొడవలితో విచక్షణారహితంగా దాడి చేయగా ఆమె ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతోంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు...మండలంలోని దిగువ పల్లి పంచాయతీ యానాదిపాళెంకు చెందిన గంగులమ్మ(45)కూలీ పనులు చేసుకొంటోంది. సొంత చిన్నాన్న కుమారుడు నాగరాజ గంగాపురంలో మాంసపు దుకాణంలో పనిచేస్తున్నాడు. గంగులమ్మ భర్త మరణించడంతో ఒంటరిగా వుంటోంది. ఈక్రమంలో తన సోదరుడి ఆస్తి తనకు ఇవ్వాలని పలుమార్లు నాగరాజ అడుగుతాడు. అయితే గంగులమ్మ తిరస్కరిస్తుంది. దీంతో కోపోద్రేకుడైన నాగరాజ మంగళవారం రాత్రి మద్యం సేవించినవాడై గంగులమ్మ ఇంటికి వెళ్ళి కొడవలితో ఆమెపై దాడి చేసాడు. ముఖం, చేతులు, తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు గంగులమ్మను 108సేవల ద్వారా మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి తండ్రి బీరప్ప ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.ఐదు లక్షలు విరాళం

కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ పథకాలకు ఓ భక్తుడు బుధవారం రెండు లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు నంది గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధినేతలు శ్రీనివాసరావు, మల్లేశ్వరిలు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయలను, గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# తిరుమల తరహా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

**ఫిబ్రవరి 8 నుండి 16 వరకు బ్రహ్మోత్సవ వాహన సేవలు : టిటిడి అధికారులతో జెఈఓ వీరబ్రహ్మం**



చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల తరహాలో శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు టిటిడి జెఈఓ వీరబ్రహ్మం తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై బుధవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరస్పర సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం గ్రామగ్రామాన బ్రహ్మోత్సవాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్నారు. ఆలయంలో విద్యుత్ దీపాలంకరణ, ఆర్చిల నిర్మాణం, ఫ్లెక్సీల ఏర్పాటు, భక్తులకు అవసరమైన అన్నప్రసాదాలు, తిరుమల లడ్డూ ప్రసాదాలు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం, పారా మెడికల్ సిబ్బంది, కళ్యాణ కట్టలో అధనపు సిబ్బంది, ట్రాఫిక్ నియంత్రణ, పటిష్ట భద్రతపై చర్చించారు. ఈ నెల 12న గరుడవాహన సేవకు లక్ష్మీహారం శోభాయాత్ర, గోదాదేవి మాలలను తీసుకువచ్చే మార్గాలలో ముందస్తు జాగ్రత్తలను పాటించాలన్నారు. అదేవిధంగా రథోత్సవం, చక్రస్నానం రోజుల్లో అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. ఎస్వీబిసి ద్వారా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ ప్రసారం చేయాలన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్, బస్టాండ్, టిటిడి సత్రాలు, శ్రీనివాసం, విష్ణు నివాసం వంటి భక్తుల రద్దీ కలిగిన ప్రదేశాలలో కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద వాహన సేవలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, టిటిడి అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఆలయ మాడవీధులలో, వాహన మండపంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపిఆర్ఓ రవి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, డిప్యూటీ ఈఓలు వి.ఆర్.శాంతి, సెల్వం, ఎస్వీబిసి ఇన్‌చార్జ్ సిఈఓ డి.ఫఫణికుమార్ నాయుడు, విద్యుత్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, విజిఓ గిరిధర్, అధనపు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సునీల్, ఏఈఓ గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

# చక్రం తిప్పిన ఎమ్మెల్యే గురజాల

**గుడిపాల ఎంపిపి కుర్చీ చేజిక్కించుకున్న టిడిపి**



గుడిపాల, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు తన సొంత మండలం గుడిపాలలో చక్రం తిప్పారు. ఇది వరకు వైకాపా ఖాతాలో వున్న ఎంపిపి కుర్చీని పక్కా వ్యూహం రచించి ఎమ్మెల్యే గురజాల ఆ కుర్చీపై తెలుగుదేశం ఎంపిటిసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరిని కూర్చోబెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఎంపిటిసీ ఎన్నికల్లో గుడిపాల మండలంలో మొత్తం 12 ఎంపిటిసీ స్థానాలు వుండగా అందులో 10 స్థానాల్లో వైకాపా అభ్యర్థులు విజయం సాధించగా, కేవలం రెండు స్థానాల్లో మాత్రమే తెలుగుదేశం అభ్యర్థులు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అత్యధిక ఎంపిటిసీ స్థానాలు చేజిక్కించుకున్న వైకాపా ఎంపిపి కుర్చీపై ప్రసాద్‌రెడ్డిని కూర్చోబెట్టింది. గుడిపాల మండల ఎంపిపి కుర్చీని ఎలాగైనా టిడిపి దక్కించుకోవాలని గుడిపాల మండలానికే చెందిన గురజాల చిత్తూరు ఎమ్మెల్యేగా వుండటంతో సొంత మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేయాలని భావించి వైకాపా ఎంపిటిసీలను తన గుప్పిట్లో పెట్టుకోవడం ప్రారంభించారు. ఈ మేరకు ఎంపిపి ప్రసాద్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టించి ఎన్నికల్లో ఓడించారు. అప్పటి నుండి గుడిపాల మండలానికి ఎంపిపి లేకపోయింది. ఎలక్షన్ కమీషన్ ఎంపిపి ఎన్నిక నిర్వహించాలని షెడ్యూల్ జారీ చేయడంతో ఎమ్మెల్యే గురజాల ఆ మేరకు వ్యూహం రచించి గుడిపాల ఎంపిటిసీ గోళ్ళ హరిప్రసాద్ చౌదరిని ఎంపిపిగా ఎంపిక చేయించారు.

## ఫీడ్ బ్యాక్‌తో మాడ్యూల్స్ కార్యాచరణ

**-టిటిడి ఇన్‌ఛార్జి ఈఓ వెంకయ్యచౌదరి**



తిరుమల, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:
జ్యోతిష్య శాస్త్రం, నిత్యార్చన, శిక్షణ నిర్ధారణ తదితర అంశాలపై తీసుకునే శిక్షణ తరువాత శిక్షణ పొందిన వాళ్ళు ఏమి నేర్చుకున్నారు, ఇంకా ఏమి నేర్చుకోవాలో తదితర అంశాలపై ఫీడ్ బ్యాక్ సేకరించి తదనుగుణంగా మాడ్యూల్స్ రూపొందించాలని టిటిడి ఇన్‌ఛార్జి ఈఓ, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సూచించారు. సనాతన ధర్మాన్ని నవతరానికి అందించాలన్నారు. శాస్త్రం, సంప్రదాయాలకు సాంకేతికతను జోడించి వారసత్వ సంపదను కాపాడాలని అర్చక శిక్షణా తరగతులను ప్రారంభించినట్లు తెలిపారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో బుధవారం ఉదయం నిర్వహించిన అర్చక, పరిచారిక ,వేదపారాయణందారుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిటిడి వైఖానస ఆగమ సలహాదారు డాక్టర్ భావనారాయణాచార్యులు, ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా శివ సుబ్రహ్మణ్యం అవధాని, వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు, శ్వేత ఇంఛార్జ్ డైరెక్టర్ సువర్ణమ్మ, డిప్యూటీ ఈఓ (జనరల్ ) ఏ. శివప్రసాద్ ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ క్లినిక్ : ఆర్డీఓ

పెనగలూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఆర్డీవో రామ మోహన్ తెలిపారు. బుధవారం పెనగలూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యాప్తంగా రైతులు, ప్రజలు దాదాపు 85 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎన్ ఆర్ పురం పంచాయతీ లో దారి ఆక్రమణల పై ఎన్ని సార్లు అర్జీలు ఇచ్చినా న్యాయం జరగడం లేదని గ్రామ ప్రజలు ఆర్డీవోకు అర్జీ ఇచ్చారు. వెలగచర్ల రెవెన్యూ విలేజ్‌లో భూ రికార్డులు తారుమారు జరిగాయని ఆరోపిస్తూ గ్రామ ప్రజలు ఆర్డీవోకి వినతి పత్రం ఇచ్చారు. రికార్డుల తారుమారు విషయంలో వీఆర్వో మధుకు షోకాజ్ నోటీస్ ఇచ్చి వివరణ తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమం తహసీల్దార్ అమరేశ్వరి, డీటీ సుమని, డీటీ శ్రీనివాసులు, ఆర్ ఐ రామ్మోహన్, సర్వేయర్ ప్రభాకర్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కృతం భారతీయ సంస్కృతికి నిలయం



తిరుపతి విద్య ఫిబ్రవరి 4 ప్రభాత వార్త
ఘనంగా ప్రారంభమైన టాలెంట్ ఫెస్ట్2028సంస్కృతం భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయమని విశ్రాంత జార్ఖండ్, ఒడిస్సా హైకోర్టు చీఫ్ జస్టీస్, జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యులు జస్టీస్ బిద్యుత్ రంజన్ షడంగి పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో నాలుగు రోజుల పాటు జరగనున్న ఇండియన్ సాంస్క్రిట్ స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్ 2028 బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ సంస్కృతంలో అనేక విషయాలు దాగి ఉన్నాయని ప్రత్యేకించి దేశాన్ని ఏకంగా ఉంచడానికి సాంస్క్రిట్ వన్ ఆఫ్ ది బెస్ట్ లాంగ్వేజ్ అని, సంస్కృతం మన ప్రాచీన సాంప్రదాయాలను సంస్కృతిని సంరక్షి స్తుందదన్నారు. మన భారతీయ సంస్కృతి చాలా బలమైనది కావడంతో భిన్నత్వంలో ఏకత్వంగా దేశం వెలుగొందుతోందన్నారు. భారతీయ సంస్కృతికి సంరక్షకులం మనమేనని వేరే వారు సంస్కృతాన్ని సంరక్షి ంచలేరని అభిప్రాయపడ్డారు. మన భారతదేశాన్ని మనమే సంరక్షి ంచుకోవాలని తెలియజేశారు. ప్రతి వ్యక్తి సంస్కృత వైభవం కొరకు పాటుపడాలని, ఈ పోటీల్లో విద్యార్థులు లో ఉన్న జ్ఞానాన్ని వెలికితీసి, అధ్యయనం చేయనుండటం విశేషమని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ రజనీకాంత్ శుక్లా, రిజిస్ట్రార్ వెంకటనారాయణరావు, ప్రొఫెసర్ దక్షి ణమూర్తి శర్మ, డాక్టర్ భరత్ భూషణ్ రథ్, డాక్టర్ ప్రదీప్ కుమార్, ఉదయాన హెగ్డే, అధ్యాపకులు, పలు వర్సిటీల నుంచి పోటీలలో పాల్గొనేందుకు విచ్చేసి విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తోంది సిఎం చంద్రబాబే

**- ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి**
**- ఘనంగాఅమ్మళ్ల చెరువులో జలహారతి !!**



పెద్దపంజాణి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తోంది, రైతులకు నీళ్ల అందిస్తోంది సిఎం చంద్రబాబునాయుడేనని ఎమ్మెల్యే అమరనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాజుపల్లి పంచాయతీ అమ్మళ్ల చెరువు కృష్ణాజలాలతో నిండడంతో ఎమ్మెల్యే కూటమి నేతలతో కలసి జలహారతి కార్యక్రమంఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులపై వైకాపా తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. కరువు ప్రాంతమైన రాయలసీమకు నీళ్ల ఇవ్వాలని దివంగత ఎన్టీఆర్ బీజం వేయగా సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. ఈ 22నెలల కాలంలో సీమ సాగునీటి ప్రాజెక్టులకు ఏకంగా 12500కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. 366టిఎంసిల నీరు రాయలసీమ ప్రాజెక్టులో నిల్వ చేసి రికార్డు సృష్టించామన్నారు. జగన్ ప్రభుత్వంలో గేట్లు పెట్టి స్టంట్‌లు వేశారని విమర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ హనుమంతు, ఎంపిడిఒ బాలాజీ, డిఇలు సెల్వరాజ్, చోక్లానాయక్, ఎఇలు హరిప్రసాద్, మహేష్‌కుమార్, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, నేతలు ఆనంద్, చలపతి, మురహరిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, రోజారెడ్డి, భానుప్రతాప్‌రెడ్డి, నాగిరెడ్డి, జయరాంరెడ్డి, బావాజాన్, మంజునాథరెడ్డి, ముబారక్, జనసేన శివ పాల్గొన్నారు.

